జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

ఆదివారం | 4-08-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 89 పేజీలు: 8 వెల : రూ.7

# దివ్యాంగులకు అండగా...

# కూటమి ప్రభుత్వం

* సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురండి * ఎల్లవేళలా అందుబాటులో ఉంటాను
* కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు * దివ్యాంగులు అన్నింటా రాణిస్తున్నారు: కలెక్టర్ * అలింకో సహకారంతో 479 మందికి 823 ఉపకరణాలు పంపిణీ

**శ్రీకాకుళం, ఆగస్టు 3 (వార్త):** దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని, తాను అండగా ఉంటానని కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళంలోని ఒక ప్రైవేటు హెటల్లో శనివారం సాయంత్రం వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సామాజిక న్యాయం సాధికారత కేంద్ర మంత్రిత్వ శాఖ, ఆర్టిఫిషియల్ లింబ్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఆలింకో) సహకారంతో వికలాంగులకు ఉచిత సహాయ ఉపకరణాలను పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ జిల్లా లోని దివ్యాంగుల ఆశీస్సులతో తనకు అతి చిన్న వయసులోనే



కేంద్ర మంత్రిగా అవకాశం దక్కిందని, అందుకే కేంద్ర మంత్రిగా తన తొలి కార్యక్రమాన్ని వారితో నిర్వహించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 479 మందికి రూ.73.32 లక్షలు విలువచేసే 823 ఉపకరణాలను ఒక్క రోజే పంపిణీ చేసే అవకాశం తనకు కలిగిందని చెప్పారు. ప్రతి వికలాంగుడికి సహాయపడే ప్రతీ సహాయ ఉపకరణాన్ని అందజేస్తామని తెలిపారు. దివ్యాంగుల కోసం పింఛన్ రూ.6 వేలు పెంచి ఇస్తున్న ప్రభుత్వం దేశంలో తమదేనని అన్నారు. దివ్యాంగులకు ఎప్పుడు ఎలాంటి సహాయం కావాలన్నా తాము ముందుంటామని వెల్లడించారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ దివ్యాంగులు ఎందులోనూ తీసి పోరని చెప్పారు. వారు ఆర్టీసీ బస్సుల్లో సులువుగా ప్రయాణించేందుకు మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. అన్ని ప్రభుత్వ శాఖలు తమ నిధుల్లో కనీసం మూడు శాతం దివ్యాంగుల అభ్యున్నతి కోసం ఖర్చు చేసేలా సర్కులర్ జారీ చేస్తామని వెల్లడించారు. విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, శ్రీకాకుళం, నరసన్నపేట శాసన సభ్యులు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం రూ.3వేల నుంచి రూ.6వేలకు పెన్షన్ పెంచిందన్నారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడి కవిత, నెహ్రూ యువ కేంద్రం కోఆర్డినేటర్ ఉజ్వల్, మెప్మా పిడి కిరణ్ కుమార్, జిల్లా ఉపాధి కల్పన అధికారి సుధ, టూరిజం అధికారి నారాయణరావు, సెట్ శ్రీ సీఈఓ ప్రసాదరావు, కింజరాపు హరిప్రసాద్, ఆలింకో కోఆర్డినేటర్ రవిశంకర్, దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రమణమూర్తి, జిల్లా నలుమూలల నుంచి పలువురు దివ్యాంగులు హాజరయ్యారు.



* ఉత్తర్వులు జారీ చేసిన విశాఖ డీఐజీ
* పెండింగ్‌లో మరికొందరు * అధికమంది వీఆర్‌కు..
* పనిచేయని పలువురు సీఐల లాబీయింగ్

# సీఐలకు బదిలీ

**శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 3 (వార్త):** విశాఖ రేంజ్ పరిధిలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ శనివారం డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన పలువురు సీఐలకు ఇంకా బదిలీ కాలేదు. మరికొందరికి విశాఖ కు వీఆర్‌కు పంపించారు. శ్రీకాకుళం ట్రాఫిక్ సీఐ ఎం.అవతారంకు జేఆర్‌పురం సీఐగా, శ్రీకాకుళం టాస్క్‌ఫోర్సు సెల్ సీఐ చరకాన సూరినాయుడుకు విజయనగరం ట్రాఫిక్ సీఐగా బదిలీ అయింది. జేఆర్‌పురం సీఐ జి.రామచంద్ర రావుకు విశాఖ వీఆర్, కొత్తూరు సీఐ ఆర్.వేణుగోపాల్‌కు విశాఖ వీఆర్, సోంపేట సీఐ హెచ్.మల్లేశ్వరరావుకు విశాఖ వీఆర్‌కు, నరసన్నపేట సీఐ బూర ప్రసాదరావుకు విశాఖ వీఆర్‌కు పంపించారు. సీఐడీ విభాగంలో సీఐగా ఉన్న కె.శ్రీనివాసరావుకు నరసన్నపేట సీఐగా బదిలీ అయింది. ఇంటెలిజెన్స్ సీఐగా ఉన్న కునుకు శ్రీనివాసరావుకు టెక్కలి రూరల్ సీఐగా, టెక్కలి సీఐ సూర్యచంద్రమౌళికి విశాఖ వీఆర్‌కు పంపించారు. ఏసీబీ సీఐగా ఉన్న మీసాల చిన్నంనాయుడుకు ఇచ్ఛాపురం సీఐగా, ఇచ్ఛాపురం సీఐగా ఉన్న టి.ఇమ్మాన్యుయల్ రాజుకు శ్రీకాకుళం డీఎస్‌బీకి బదిలీ అయింది. శ్రీకాకుళం డీఎస్‌బీ సీఐగా ఉన్న ఆర్.సత్యనారాయణ రెడ్డిని విశాఖ వీఆర్‌కు, శ్రీకాకుళం రూరల్ సీఐగా ఉన్న లెంక సన్యాసినాయుడును విశాఖ వీఆర్‌కు పంపిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇంకా ఆమదాలవలస, పాతపట్నం, పలాస సీఐలకు ఇంకా బదిలీలు పెండింగ్‌లో పెట్టినట్టు తెలుస్తోంది. వీరంతా తక్షణమే ఆయా పోస్టుల్లో జాయిన్ కావాలని డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాకుళం జిల్లాలో పనిచేసిన ఎక్కువ మంది సీఐలకు విశాఖ రేంజ్ కార్యాలయానికి వీఆర్‌గా బదిలా కావడం చర్చనీయాంశమైంది. మరో వారం రోజుల్లోగా ఎస్ఐలకు కూడా బదిలీ అయ్యే అవకాశం ఉందని పోలీసు వర్గాలు చర్చించుకుంటున్నారు. సీఐలు కొందరు పోస్టింగ్‌ల కోసం మంత్రులు, ఉన్నతాధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఫలితం లేకుండా పోయిందని గుసగుసలు వినిపించాయి.



# ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు నిర్వహిద్దాం

* జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ * ఎస్పీతో కలిసి పనుల పరిశీలన

**శ్రీకాకుళం, ఆగస్టు 3 (వార్త):** భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను శనివారం స్థానిక ప్రభుత్వం బాలుర డిగ్రీ కళాశాల మైదానంలో వివిధ శాఖల అధికారులతో ఆయన పరిశీలిం చారు. పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై అధికారు లకు సలహాలు సూచనలు అందజేశారు. ప్రజా ప్రతినిధులకు, జిల్లా అధికారు లకు, స్వాతంత్ర్య సమరయోధులకు, ప్రజలకు సీటింగ్ ఏర్పాట్లు ప్రోటోకాల్ ప్రకా రం చేపట్టాలని, ఆకర్షణీయంగా ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. మైదానం అంతా పరిశుభ్రంగా సిద్ధం చేయాలన్నారు. ప్రజలం దరూ వేడుకలను వీక్షించే విధంగా అవసరమైన అన్ని ఏర్పాట్లులను సిద్ధం చేయాలన్నారు. ఈ పర్యటనలో ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి, డీస్పీ శృతి, శేషాద్రి, రెవిన్యూ డివిజనల్ అధికారులు సి.హెచ్ రంగయ్య, నగరపాలక సంస్థ కమిషనర్ ఓబులేసు, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి వెంకటేశ్వర రావు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె చెన్నకేశ్వరావు, ఆర్అండ్‌బి ఎస్సీ జాన్ సుధాకర్, శ్రీకాకుళం తహసిల్దార్ గణపతి రావు తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## హార్బర్ పనులు వేగవంతం చేయండి

**ఎచ్చెర్ల:** బుడగట్లపాలెం సముద్రతీరంలో నిర్మిస్తున్న ఫిషింగ్ హార్బర్ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. జిల్లా కలెక్టర్ శనివారం తన పర్యటనలో భాగంగా ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో రెవిన్యూ, అటవీ శాఖలు సంయుక్తంగా సర్వే జరిపి హార్బర్ పనులకు అడ్డంకి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆగిపోయిన హార్బర్ పనులను ప్రారంభించి ప్రతి 15 రోజులకు ఒకసారి తనకు నివేదిక అందజేయాలన్నారు. ఈపర్యటనలో రెవిన్యూ డివిజనల్ అధికారి రంగయ్య, మత్స్య శాఖ ఉపసంచాలకులు పి.వి.శ్రీనివాసరావు, ఎచ్చెర్ల, రణస్థలం తహసిల్దార్లు, ఏపీమారిటోరియం బోర్డు అసిస్టెంట్ ఇంజినీర్ పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం టౌన్





## రహదారులపై పశువులు

**నరసన్నపేట, ఆగస్టు (వార్త):** నరసన్నపేట పట్టణంలోన అత్యంత రద్దీగా ఉంటున్న మార్కెట్ ప్రాంతంలో విచ్చలవిడిగా పశువులను విడిచి పెడుతుండడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాయంత్రం వేళల్లో రహదారులపై పశువులు మందలుగా వస్తుండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్కొక్క సమయంలో వీటితో పలువురు గాయాల పాలైన ఘటనలు కూడా చోటు చేసుకున్నాయి. దీనిపై సంబంధిత అధికారులు తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## మందస సర్పంచ్ కుటుంబానికి...
# మాజీ మంత్రి సీదిరి పరామర్శ

**మందస, ఆగస్టు3 (వార్త):** మేజరు పంచాయతీ మందస సర్పంచ్ చెరుకుపల్లి యల్లమ్మ, చెరుకుపల్లి లక్ష్మణమూర్తి కుటుంబాన్ని



మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పరామర్శించారు. లక్ష్మణమూర్తి మాతృమూర్తి పోలమ్మ అకాల మరణం చెందడంతో పార్టీ నాయకులతో కలసి ఆ కుటుంబానికి సానుభూతి తెలిపారు. లక్ష్మణమూర్తి సోదరుడు చెరుకుపల్లి సత్యం పలాస మండల విద్యాశాఖాధికారిగా పనిచేస్తున్నారు. అదే విధంగా పలాస మున్సిపాలిటీ పెంటిభద్ర గ్రామానికి చెందిన సవర ప్రసాద్, పలాస మండలంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గొర్రె వేణు తల్లి పద్మావతి కూడా అనారోగ్యంతో మరణించడంతో మృతుల కుటుంబాలను పరామర్శించి, వారికి భగవంతుడు మనోధైర్యాన్ని ఇవ్వాలని ప్రార్థించారు. కార్యక్రమంలో మందస ఎంపీపీ డొక్కరి దానయ్య, వైఎస్సార్ కాంగ్రెస్పార్టీ మండల అధ్యక్షుడు అగ్గున్న సూర్యారావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి దల్లి జానకిరావు, పార్టీనాయకులు పైల చిట్టిబాబు, బత్తిని హేమేశ్వరరావు, కర్రి గోపాలకృష్ణ, సిందిరి జగన్, బమ్మిడి దుర్యోధన, కొండల ధిల్లేశ్వరరావు, ఉంగ సాయి, యర్నాగుల శ్రీనివాసరావు, తలగాన హరికృష్ణ, పత్రి లచ్చన్న, మద్దిల రామారావు, బరాటం జయప్రకాశ్, సవర నీలకంఠం, గుంపు జగదీష్, బుడకల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



### మృతుల కుటుంబాలకు..

**పలాస, ఆగస్టు 3 (వార్త):** వివిధ కారణాలతో మృతి చెందిన కుటుంబాలను డాక్టర్ సీదిరి అప్పలరాజు శనివారం పరామర్శించారు. పెంటిభద్రకు చెందిన సవర ప్రసాద్ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. సీనియర్ వైసిపి నాయకులు గోర్లు వేణుగోపాల్ మాతృమూర్తి అనారోగ్యంతో మృత్యువాత పడడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట కౌన్సిలర్లు బోరా బుజ్జి, దుర్గా శంకర్ పండా, సీనియర్ వైసీపీ నాయకుడు డబ్బీరు భవాని, పలాస ఎంపీపీ ప్రతినిధి ఉంగ సాయి కృష్ణ, మాజీ ఎంపీపీ బత్తిన హేమశ్వరరావు, పైల్ చిట్టి, ఎంపీటీసీ దుర్యోధన ఉన్నారు.



## 9న ఆదివాసీ పోరాట దినంగా నిర్వహించండి

**పలాస, ఆగస్టు 3 (వార్త):** ఆదివాసీ హక్కుల రక్షణ కోసం ఈనెల9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పోరాట దినంగా నిర్వహించాలని అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు మామిడి భీమారావు, జిల్లా ఉపాధ్యక్షుడు సవర బంగ్లా కుమార్ తెలిపారు. లొత్తూరు పంచాయతీ హల్దుగాంలో కరపత్రాన్ని విడుదల చేశారు. ఆదివాసి దినోత్సవం పేరుతో ఉత్సవాలు జరపడం వల్ల ఒరిగేది ఏమీ లేదన్నారు. భారతదేశంలో ఆదివాసీలు అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. దేశంలో అడవులు కొండల నుండి ఆదివాసీలను గెంటివేసే చర్యలకు పాల్పడుతున్నారు. 1/70 చట్టం అమలు కావడం లేదన్నారు. పలు గిరిజన గ్రామాలను ఏజెన్సీలో చేర్చుడం లేదన్నారు. విద్య, వైద్యానికి ఇంకా దూరంగానే ఉన్నారన్నారు.

## మెగా వైద్య శిబిరం విజయవంతం



**పలాస, ఆగస్టు 3 (వార్త):** లొత్తూరు, పెంటిభద్ర గ్రామాలలో మండల లీగల్ సెల్ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి మాధురి, బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో సరైన వైద్య సదుపాయాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. సరైన రహదారి ఉంటేనే ఆ ప్రాంతానికి వైద్య సదుపాయం లభిస్తుందని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో వైద్యం కావాలంటేనే మూడు నాలుగు మైళ్ళు ప్రయాణించవలసిన వస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా రోగులకు డాక్టర్. సునీల్, డాక్టర్ మౌనిక, డాక్టర్ సాయికిరణ్ పరీక్షించి మందులు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక స్కూల్ ను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమం లో బార్ అసోసియేషన్ కార్యదర్శి పిండి వెంకటరావు, జాయింట్ సెక్రటరీ జిఎంఎస్ అనిల్ రాజు, ఎల్ చంద్రశేఖర్, కోత రజనికుమార్, తాండ్ర మురళి, ప్రభాకర్,రవికుమార్ పట్నాయక్, కె దేవరాజు, శ్యామ్, చిట్టిబాబు, న్యాయవాదులు పిండి వెంకటరావు, తేజేశ్వరరావు, కోర్ట్ సూపరింటెండెంట్ కృష్ణ, ఫార్మాసిస్ట్ బోనెల గోపాల్, సర్పంచ్ సవర పద్మ, పాస్టర్ రామకృష్ణ, కౌన్సిలర్ ఎస్ సోమేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ రాంబాబు, హెడ్ మాస్టర్ వైకుంఠ రావు శ్రీధర్, ఆరోగ్యకార్యకర్తలు ఈశ్వరి, ఇందిరా, ఆశ వర్కర్స్ పోలీసులు పాల్గొన్నారు.

## నేటి నుంచి తెరుచుకోనున్న జీడి పరిశ్రమలు

**పలాస, ఆగస్టు3 (వార్త):** జీడి పరిశ్రమలు ఆదివారం నుంచి తెరుచుకుంటున్నాయని పలాస ఇండస్ట్రియల్ ఎస్టేట్ అధ్యక్షుడు మల్లా రామేశ్వరరావు తెలిపారు. గతనెల 19 నుంచి పరిశ్రమలు బంద్ ఉన్నాయన్నారు. పరిశ్రమలు తెరుచుకోనుండడంతో కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## తల్లిపాలే బిడ్డకు శ్రేష్టం

**జలుమూరు, ఆగస్టు (వార్త):** తల్లిపాలే బిడ్డకు శ్రేష్టమని అచ్యుతాపురం మెడికల్ ఆఫీసర్ పి సుజాత అన్నారు. జలుమూరు మండలంలోని అచ్యుతాపురం అంగన్వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తల్లిపాల విశిష్టతపై గర్భిణీలు, తల్లులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ.. పిల్లలకు తల్లిపాలు తప్పనిసరిగా తాగించాలని, వాటిలో పౌష్టికాహారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## నరసన్నపేటలో తల్లిపాల వారోత్సవాలు

**నరసన్నపేట, ఆగస్టు (వార్త):** నరసన్నపేట మేజర్ పంచాయితీలోని స్థానిక పెద్దపేట వద్ద ఉన్న అంగనవాడీ కేంద్రంలో జరిగిన తల్లిపాల వారోత్సవాల్లో సర్పంచ్ బూరెల్లి శంకరరావు పాల్గొన్నారు. శనివారం అంగన్వాడీ కార్యకర్త పుణ్యవతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ.. గర్భిణీలకు, బాలింతలకు తప్పనిసరిగా పౌష్టిక ఆహారాన్ని అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.



## 24 మంది సచివాలయ ఉద్యోగులకు నోటీసులు

**సారవకోట, ఆగస్టు (వార్త):** సారవకోట మండలంలోని 24 మంది సచివాలయ ఉద్యోగులకు ఎంపీడీవో రాంబాబు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మండలంలో 8,420 మంది సామాజిక భద్రత పింఛనుదారులు ఉండగా వీరికి పింఛను మొత్తాలు అందించడానికి 181 మంది సచివాలయ ఉద్యోగులను నియమించారు. ఈనెల 1న ఉదయం 5:30 గంటల నుంచి పింఛను మొత్తాలు అందించాలని సూచించినప్పటికీ 24 మంది ఉదయం 6:30 గంటల వరకు లాగిన్ కాకపోవడంతో చర్యలు తీసుకున్నామన్నారు.

## పశు గణన సక్రమంగా నిర్వహించండి

**నరసన్నపేట, ఆగస్టు (వార్త):** కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 21వ అఖిల భారత పశుగణన (లెక్కింపు) ను సక్రమంగా నిర్వహించాలని నరసన్నపేట పశుసంవర్ధక శాఖ ఏడి రాజగోపాలరావు అన్నారు. నరసన్నపేట పశుసంవర్ధకశాఖ ఏడీ కార్యాలయంలో పశుగణనపై క్షేత్రస్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సెప్టెంబర్ 1 నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు పశు గణన కార్యక్రమంలో పాల్గొని వివరాలను అందజేయాలని ఆదేశించారు.

## ఖరీఫ్ పంటకు ఈ-క్రాప్ తప్పనిసరి



**నరసన్నపేట, ఆగస్టు3 (వార్త):** ఖరీఫ్ పంటలకు తప్పనిసరిగా ఈ-క్రాప్ చేపట్టాలని వ్యవసాయ శాఖ ఏడీ రవీంద్ర భారతి, ఏవో సునీత ఆదేశించారు. శనివారం నరసన్నపేట మండలం సత్యవరం ఆర్ బి కే కేంద్రంలో వ్యవసాయ సహాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి రైతు పంటను ఈ-క్రాప్ చేపట్టాలని తెలిపారు. వీటిని చేపట్టడం వలన రైతులకు ఏమైనా అనుకోని నష్టాలు కలిగినప్పుడు ప్రభుత్వం తరఫునుండి వారిని ఆదుకోవడం జరుగుతుందన్నారు.

## ఇంటర్ కళాశాలలో మౌలికవసతులు ఉండాలి



**నరసన్నపేట, ఆగస్టు (వార్త):** ఇంటర్ ప్రైవేట్ కళాశాలలో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు ఉండాలని ఇంటర్మీడియట్ జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి బి.దుర్గారావు అన్నారు. శనివారం నరసన్నపేటలో పలు ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఆయన పరిశీలించారు. ప్రాక్టికల్స్ నిర్వహణకు పూర్తి స్థాయిలో ల్యాబ్ అవసరమన్నారు. విద్యార్థులకు అందుబాటులో గ్రంథాలయాలు ఉండాలన్నారు. ప్రతిరోజు ప్రాక్టికల్స్ నిర్వహించాలని ప్రైవేట్ కళాశాలలకు ఆయన సూచించారు.

## సచివాలయం భవనం మెట్ల ధ్వంసం



**సంతబొమ్మాళి, ఆగస్టు3 (వార్త):** సంతబొమ్మాళి మండలం మేఘవరం గ్రామానికి చెందిన పనపాన వెంకట రెడ్డి అనే వ్యక్తి తనకు గత టిడిపి ప్రభుత్వం హయాంలో 14/9 సర్వే నెంబర్లో 2సెంట్లు స్థలం తన భార్య కుమారి పేరున పట్టా ఇచ్చారని ఆ స్థలంలో సచివాలయం గోడౌన్ మెట్లు కట్టే సారని వెంకటరెడ్డి ఆ మెట్లను ధ్వంసం చేశాడు. ప్రభుత్వం నుంచి పనపాన కుమారి పేరున ఎటువంటి పట్టా లేదని గ్రామంలో కొందరు ప్రోద్బలంతో ప్రభుత్వ ఆస్తులు ధ్వంసానికి పాల్పడ్డారని సర్పంచ్ అన్నారు. గతంలో అప్పటి తహసీల్దార్ ఎటువంటి పట్టా మంజూరు చేయలేదని అండర్స్టాంట్ ఇచ్చారని దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ భర్త శ్రీనివాస రెడ్డి కోరారు.

## రేషన్ బియ్యం పంపిణీ తనిఖీ



**మందస, ఆగస్టు 3 (వార్త):** పేదలకు అందిస్తున్న పీడీఎస్ రేషన్ బియ్యం పంపిణీని పలాస ఆర్డీఓ భరత్ నాయక్ తనిఖీ చేశారు. మందస పట్టణంలో మూడు డిపోల వద్ద అందిస్తున్న బియ్యం కొలతలు, ధర పరిశీలించారు. సక్రమంగా సరుకులు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఎస్ డిప్యూటీ తహసీల్దార్ శానాపతి రవికుమార్, మందస తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది నర్సింగదాస్ పాల్గొన్నారు.

## హరిపురంలో సీబీఆర్ఎం సమావేశం


**మందస, ఆగస్టు 3 (వార్త):** మందస మండలంలోని హరిపురంలో ఏపీజీవీబీ బ్రాంచ్ మేనేజర్ ఎస్.ఉమశంకర్ ఆధ్వర్యంలో సి.బి.ఆర్.ఎం(కమ్యూనిటీ బేస్డ్ రికవరీ మెకానిజం) మీటింగ్ నిర్వహించడం జరిగింది. సమావేశంలో సెర్ప్ ఏపీఎం గౌడబ ప్రసాదరావు మాట్లాడుతూ ఈ ఆర్టిక సంవత్సరంలో ఉమెన్ లెడ్ ఎంటర్ప్రెన్యూర్ టార్గెట్ ఎస్బీఐ బ్రాంచ్ లో అప్లై చేసుకున్న వారికి.. మేనేజర్ అర్హత ఉన్నవారికి విల్లింగ్ ఇస్తూ గ్రౌండింగ్ చెయ్యాలని కోరారు. అనంతరం ఇంటర్నల్ ల్యాండింగ్ ఇవ్వడానికి మేనేజర్ చొరవ చూపాలని, రైతు ఉత్పత్తి దారుల సంఘాలకు కొత్త ఖాతాలు ఓపెనింగ్ చెయ్యాలని, ఎస్బీఐ బ్రాంచ్ మేనేజర్ కోరారు. మేనేజర్ ఉమాశంకర్ మాట్లాడుతూ లింకేజీలకు విఓఏలు సంఘాలను బ్యాంక్ కు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో వీఓఏలు కూడా పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## బాధితులకు జడ్పీటీసీ పరామర్శ

**పోలాకి, ఆగస్టు 3 (వార్త):** రాజారాంపురం గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఎంపీటీసీ కొమరం నారాయణమూర్తితోపాటు అదే గ్రామానికి చెందిన కోడ గురుమూర్తి, సూరాడ రాంబాబులను పోలాకి జడ్పీటీసీ డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య పరామర్శించారు. ఆయన వెంట డీసీసీబీ మాజీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపీపీ ముద్దాడ బైరాగి నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కణితి కృష్ణారావు, జేసిఎస్ కన్వీనర్ కణతి సత్తిబాబు, దోణి నూకరాజు, కుందు పోలీసు, దోణి నారాయణ, కోడ చిన లక్ష్మణరావు, చోడిపిండి అప్పారావు, గనగళ్ళ రామారావు ఉన్నారు.



## నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా

### పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

**మెళియాపుట్టి, ఆగస్టు3 (వార్త):** పాతపట్నం నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మెళియాపుట్టి మండల కేంద్రంలో ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులతో పాటు సిబ్బంది శనివారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావును సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తనను రాజకీయ నాయకుడిగా కాకుండా ఒక సేవకుడిగా చూడాలన్నారు. గ్రామాలలో మౌలిక వసతుల కల్పన, ఇండస్ట్రియల్ పార్క్ నిర్మాణానికి కృషి చేస్మాని తెలిపారు. క్షేత్ర సహాయకుల జీతాలు పెంచాలని ఇటీవల కాలంలో తనకు విజ్ఞాపన పత్రం ఇచ్చారని ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కరరావు, ఏపీఓ రవి, వివిధ పార్టీల నాయకులు, అధికారులు, ఉద్యోగులు, ఉపాధి హామీ సిబ్బంది, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

## ఇంజినీరింగ్ అధికారులతో వైస్ ఎంపీపీ సమీక్ష



**కొత్తూరు, ఆగస్టు 3 (వార్త):** కొత్తూరు మండల పరిషత్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీ వరప్రసాద్ రావు శనివారం సమీక్షించారు. కూటమి ప్రభుత్వంలో 100 రోజుల వ్యవధిలో హౌసింగ్ లే అవుట్లలో ఇళ్లు పూర్తి చేయాలని లోతుగెడ్డ అన్నారు. గ్రామాల్లో అత్యవసర పనుల నిమిత్తం కొత్త పనులు చేయడానికి ఎస్‌డిఎఫ్ నిధులను కేటాయించారని అందుకోసం తక్షణమే ఆయా గ్రామాల్లో కొత్తగా చేయవలసిన పనులను గుర్తించాలని సూచించారు. అలాగే ఇంజినీరింగ్ అసిస్టెంట్ లను సచివాలయానికి పరిమితం కాకుండా ఫీల్డ్ కి వెళ్లాలని, అలాగే ఎక్కడెక్కడకి పనులు చూడడానికి వెళ్తున్నారో టూర్ డైరీ మెంటైన్ చేయాలన్నారు. కొత్త పనులను గుర్తించి గ్రామాల అభివృద్ధి కి తోడ్పడాలని కోరారు.

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటండి



**నరసన్నపేట, ఆగస్టు 3(వార్త):** వాతావరణంలో జరుగుతున్న మార్పులు కారణంగా కాలుష్యం పెరుగుతుందని, దీని నివారణకు ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని నరసన్నపేట మేజర్ పంచాయతీ సర్పంచ్ బూరెల్లి శంకర్ తెలిపారు. శనివారం జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నీడనిచ్చే సుమారు 50 మొక్కలను క్రీడా మైదానం చుట్టూ నాటించామని తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్ పాల్గొన్నారు.

## రైతు బజార్లో ఆసుపత్రి వ్యర్థాలు

**నరసన్నపేట,ఆగస్టు 3(వార్త):** నరసన్నపేట పట్టణంలోని రైతు బజార్ పరిసర ప్రాంతాల్లో ఓ ప్రైవేట్ ఆసుపత్రి యాజమాన్య సిబ్బంది వ్యర్థాలు పోస్తున్నారు. దీంతో ఆ ప్రాంతం కంపుకొడుతోంది. రైతు బజార్‌ను సక్రమంగా వినియోగించకపోవడం వల్ల అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారిందని పలువురు ఆరోపిస్తున్నారు.



# సాగులో యాజమాన్య పద్ధతులు పాటించండి

### మండల వ్యవసాయధికారి దానకర్ణుడు

**మెళియాపుట్టి, ఆగస్టు 3 (వార్త):** రైతులు వ్యవసాయ సాగులో యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయధికారి దానకర్ణుడు అన్నారు. ముకుందా పురం గ్రామంలో శనివారం జరిగిన మేలైన యాజమాన్య పద్ధతులతో కూడిన పొలంబడి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి దానకర్ణుడు మాట్లాడుతూ పొలంబడి కార్యక్రమంలో ముఖ్యంగా సేంద్రియ ఎరువుల వినియోగము అధికంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేస్తూనే తక్కువ పెట్టుబడితో నాణ్యమైన అధిక దిగుబడి సాధన లక్ష్యమన్నారు. రసాయనక అవశేషాలులేని పంట ఉత్పత్తిని అధిక మొత్తంలో సాధన దిశగా ఇండి గ్యాప్ పొలంబడి కార్యక్రమం జరుగుతుందన్నారు. రైతులందరూ సేంద్రియ ఎరువులు అధిక మొత్తంలో వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతుల పొలంలో వరినార్లు తుంచుట, సుడోమోనాస్ ఫ్లోరిసెన్సుతో వరి నారు వేర్లు శుద్ధి చేయుట, వరుసలలో వరి నాటడం, వరి పొలంలో కాలిబాటలు తీసే విధానాన్ని పొలంబడి ప్లాట్‌లో క్షేత్రస్థాయిలో రైతులకు తెలియజేశారు. పొలంబడి కార్యక్రమం ద్వారా ఉత్పత్తి చేసిన పంటను సేంద్రీయ ఉత్పత్తుల ధ్రువీకరణ సంస్థ ద్వారా ధ్రువీకరణ చేసి ధ్రువీకరణ పత్రాలను రైతులకు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారితో పాటు వ్యవసాయ సహాయకులు ఝాన్సి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.







### నాట్లు వేసేటప్పుడు సూచనలు పాటించాలి

**ఇచ్ఛాపురం, ఆగస్టు 3 (వార్త):** వరి నాట్లు వేసే ముందు నారు కోణలను తుంచి వేసి నాటు కోవాలని ఇచ్ఛాపురం మండల వ్యవసాయ అధికారి టీ భార్గవి రైతులకు సూచించారు.నారు కొనలు తుంచడం వల్ల పిక పురుగు రాకుండా పంటను కాపాడలన్నారు. పొలంబడి కార్యక్రమం లో భాగంగా శనివారం మసాకపురం గ్రామం లో ఆరోగ్య వంతమైన పంట పండించే పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిసిఎన్ఎఫ్ యూనిట్ ఇన్చార్జి ఎం.చిట్టిబాబు, ఎఫ్‌పిఓ టీమ్ ప్రియాంక, వ్యవసాయ సహాయకులు, ఏపీసీఎన్ఎఫ్ స్టాఫ్, రైతులు పాల్గొన్నారు.

# విద్యాలయాభివృద్ధికి రూ.20వేలు వితరణ

**మందస, ఆగస్టు 3 (వార్త):** సొండిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001-02 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు తాము చదువుకున్న విద్యాలయం విద్యాభివృద్ధికి రూ. 20వేలు అందించారు. ఆ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించిన సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఈ నగదును పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.సుందర్ సాల్మన్ అందజేశారు. అదేవిధంగా గత ఏడాది 10వ తరగతి పిల్లలకు పరీక్షా సామగ్రిని కూడా, ఆ బ్యాచ్ విద్యార్థి అయిన సంకోయి శ్రీను ఆధ్వర్యంలో అందించారు. పైల మోహనరావు కూడా ఆర్థిక సహకారం అందించారు. ఈ ఆత్మీయ సమ్మేళనం నిర్వహణకు సహకరించిన ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ, వారిని దుశ్శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గవ్వ భీమారావు, కొత్తపల్లి విద్యాసాగర్, ఎలుముల రాజు, నూకల మురళి, పిట్ట మహేష్ తదితరులు పాల్గొన్నారు.





## బీజేపీని బూత్ స్థాయిలో బలోపేతం చేయాలి

**ఇచ్ఛాపురం, ఆగస్టు 3 (వార్త):** బీజేపీ బూత్ స్థాయిలో బలోపేతం చేయాలని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలవలస వైకుంఠరావు అన్నారు. కేంద్రం, రాష్ట్రంలోనూ కూటమి ప్రభుత్వమే ఉందన్నారు. కార్యక్రమంలో ఆసి సత్యం రెడ్డి, కృష్ణమూర్తి, రామ్మూర్తి, లక్ష్మి, వడ్డిన జోగారావు, వడ్డిన సంతు, సాలీనా ఢిల్లీ, బాబూరావు, ముడియా రంగా, నీలవేణి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే రమణమూర్తికి సన్మానం

**పోలాకి, ఆగస్టు (వార్త):** కత్తిరివానిపేట క్యాంప్ కార్యాలయంలో నరసన్నపేట శాంతమణి మత్స్యకారుల సంఘం ప్రెసిడెంట్ కేవిటి యర్రయ్య, కమిటీ సభ్యులు కలిసి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని కలిసి దుశ్శాలువ కప్పి సత్కరించారు.



## సాగునీరు విడుదల

**నరసన్నపేట, ఆగస్టు 3 (వార్త):** పోలాకి ఓపెన్ హెడ్ ఛానల్ ద్వారా నడగాం వద్ద సాగునీటిని శనివారం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి విడుదల చేశార. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చివరి ఎకరా వరకు సాగు నీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ ఛానల్ ద్వారా దిగువ ప్రాంతం రైతులకు ఎటువంటి ఆటంకం కలగకుండా సుమారు 16,000 ఎకరాలకు సాగునీరు అందుతుందని ఎమ్మెల్యే చెప్పారు.

## మాదకద్రవ్యాలకు బానిస కావొద్దు

**ఇచ్ఛాపురం, ఆగస్టు 3 (వార్త):** మాదక ద్రవ్యాలకు బానిస కావొద్దని టౌన్ ఎస్ఐ వెన్ను సత్యనారాయణ అన్నారు. శనివారం సురంగి రాజా గ్రౌండ్లో సాధన చేస్తున్న యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. గంజాయి, కొకైన్ వంటి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. బైక్‌లు నడిపేవారు వాహన నిబంధనలు పాటించాలని, హెల్మెట్ ధరించాలన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం





## తమ్మినాయుడుపేటలో పారిశుద్ధ్యం పనులు


**బూర్జ, ఆగస్టు3 (వార్త):** తమ్మినాయుడు పేట గ్రామంలో సర్పంచ్ ప్రతినిధి మూడడ్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో ముమ్మరంగా పారిశుధ్యం పనులు చేపట్టారు. డ్రైనేజీల్లో మురుగును తొలగించి శుభ్రం చేశారు. దోమలు వ్యాప్తి చెందకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లారు. వీధులు, రహదారులకు ఇరువైపులా ఉన్న చెత్తను తొలగించి దూర ప్రాంతాలకు తరలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ రుద్రవేణి, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు

# కొవ్వాడ అణుపార్కును రద్దు చేయండి

### * తక్షణం ప్రహరీ నిర్మాణం ఆపాలి * సీపీఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు




**రణస్థలం, ఆగస్టు 3 (వార్త):** కొవ్వాడ అణుపార్కు రద్దు చేయాలని, ప్రహరీ నిర్మాణం ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, నాయకులు సి.హెచ్.అమ్మన్నాయుడు డిమాండ్ చేవారు. కొవ్వాడ అణువిద్యుత్తు ప్రభావిత గ్రామాలలో కొవ్వాడ, కోటపాలెం, అల్లివలస, పాతర్లపల్లి గ్రామాలలో పర్యటించి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుజరాత్ రాష్ట్రం మితివిర్దిలో పెట్టాల్సిన అణువిద్యుత్ కేంద్రాన్ని అక్కడ ప్రజలు వ్యతిరేకిస్తే బిజెపి ప్రభుత్వం ఏపీలోని కొవ్వాడకు తరలించిందన్నారు. రాష్ట్ర శాసనసభలో కొవ్వాడ అణుపార్కుకు వ్యతిరేకంగా తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. కొవ్వాడలో అణుపార్క్‌ను పెట్టడమంటే ఉత్తరాంధ్రలో అణుబాంబు పెట్టడమేనని అన్నారు. కొవ్వాడ భూకంపాల జోన్లో ఉందని, ఇక్కడ అణుపార్కు పెట్టడం అత్యంత ప్రమాదకరమని తెలిపారు. ఈ ప్రాంతం అధిక జనసాంద్రత ప్రాంతం అని ప్రకృతి వైపరీత్యాల వలన గాని, మానవ తప్పిదం వలన గాని, యంత్రం లోపం వలన గానీ ఏ చిన్న ప్రమాదం జరిగినా ఇటు కాకినాడ నుండి అటు ఒరిస్సా ఛత్రపూర్ వరకూ నాశనం అవుతుందని, భూమి, నీరు, గాలి సమస్తం విషతుల్యం అవుతాయని లక్షల మంది ప్రాణాలు గాలిలో కలిసిపోతాయని అన్నారు. అణుపార్క్ వలన విడుదల అయ్యే రేడియో ధార్మికత వలన భూమి, నీరు, గాలి, ఆహార పదార్థాలు విషతుల్యం అవుతాయని, ప్రజలు క్యాన్సర్ వంటి ప్రమాదకరమైన వ్యాధుల బారిన పడతారని, పుట్టే పిల్లలు వికృత ఆకారాలతో పుడతారని తెలిపారు. రేడియో ధార్మికత ఎంతవరకు వ్యాపిస్తే ఆ ప్రాంతంలో ఆహారపదార్థాలు విషతుల్యమౌతాయని చెప్పారు. వ్యవసాయ యోగ్యమైన భూములను నాశనంచేసి, జనసాంద్రత గల ప్రదేశమైన కొవ్వాడలో అణుపార్క్ పెట్టడానికి పాలకులు పూనుకోవడం దారుణమన్నారు. అభివృద్ధి చెందిన అమెరికా, జర్మనీ, జపాన్ లాంటి సాంకేతిక పరిజ్ఞానం గల దేశాలు అణువిద్యుత్ కేంద్రాలను మూసివేస్తున్నారని తెలిపారు. 1979లో అమెరికా త్రీమైల్ ఐలాండ్లో అణుప్రమాదం జరిగిన తరువాత కొత్తగా అణువిద్యుత్ కేంద్రాలు పెట్టలేదని, 1986లో చెర్నోబిల్ అణుప్రమాదం జరిగినా అక్కడ మానవాళికి నివసించడానికి వీలులేకుండాపోయింది. కాలిఫోర్నియాలో ఉన్న అణువిద్యుత్ కేంద్రాన్ని మూసివేయాలని అమెరికా చట్టం చేసిందని చెప్పారు. అమెరికాలోని కరోలినా రాష్ట్రంలో అణువిద్యుత్తు కేంద్రం నిర్మాణానికి సుమారు 60 వేలకోట్ల రూపాయలు ఖర్చు చేసి ప్రమాదకరమని మధ్యలో పని నిలుపుదల చేశారని తెలిపారు. ప్రపంచంలో అత్యంత ఎక్కువ యురేనియం నిల్వలున్న ఆస్ట్రేలియాలో ఒక్క అణువిద్యుత్తు కేంద్రం కూడా లేదని అన్నారు. లక్షల కోట్ల రూపాయలు ప్రజాధనంతో ఒకే చోట ఆరు అణు రియాక్టర్లు పెట్టడం దేశ ఆర్థిక వ్యవస్థకు, ప్రజల ప్రాణాలకు పెను ప్రమాదమన్నారు. ప్రపంచమంతా అణువిద్యుత్తుకు భయపడి ప్రత్యామ్నాయ మార్గాలవైపు అడుగులు వేస్తుంటే మన పాలకులు ఎందుకు స్వాగతిస్తున్నారని ప్రశ్నించారు. అమెరికా కార్పొరేట్ ప్రయోజనాలు కోసమే బిజెపి ప్రభుత్వం కొవ్వాడలో అణుపార్కు పెడుతుందన్నారు. అత్యంత ప్రమాదకరమైన, ఖరీదైన అణువిద్యుత్ కేంద్రాలు మనకు అవసరం లేదన్నారు. కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెలమల రమణ, గ్రామస్థులు గొర్లె తిరుపతినాయుడు, అల్లింపల్లి రాము, సుంకర పాపారావు, చౌదరి నారాయణరావు, అల్లిపల్లి లక్ష్మణరావు, సిఐటియు నాయకులు ఎల్.రామప్పడు, ఎం.రమణ, జె.గంగరాజు తదితరులు పాల్గొన్నారు.



### త్వరలోనే కార్పొరేషన్

## ఎన్నికలు నిర్వహిస్తాం

### * మేయర్, కార్పొరేటర్లు ఉంటే పరిపాలన సులువవుతుంది * కాలనీలో పార్కు నిర్మాణం చేపడతాం * శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్

**శ్రీకాకుళం టౌన్, ఆగస్టు 3 (వార్త):** త్వరలోనే కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహిస్తామని శ్రీకాకుళం నియోజకవర్గ ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని విశాఖ ఎ కాలనీ వాసులు ఎమ్మెల్యే గొండు శంకర్‌ను శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గొండు శంకర్ మాట్లాడుతూ శ్రీకాకుళం కార్పొరేషన్‌కు ఎన్నికల విషయమై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును నేరుగా సంప్రదించానన్నారు. కోర్టు చిక్కులు తొలగించుకొని మీరు సిద్ధంగా ఉంటే ఎన్నికలు నిర్వహిద్దామని చెప్పారన్నారు. కార్పొరేషన్ ఎన్నికలు జరిగి మేయర్, కార్పొరేటర్లు ఉంటే పరిపాలన సులువవుతుందని తద్వారా నగర అభివృద్ధి జరుగుతుందన్నారు. కాలనీవాసులకు ఎటువంటి ఇతర పన్నులు వేసినా, పనులకు అనుమతులు కావాలన్నా తనను నేరుగా సంప్రదించవచ్చన్నారు. దానిని పరిశీలించి పరిష్కారం చూపుతానని హామీనిచ్చారు. మరో రెండు, మూడు రోజుల్లో పార్కు అభివృద్ధికి ప్రతిపాదనలు తయారు చేసి నగరంలోనే అత్యంత సుందరమైన పార్కును తీర్చిదిద్ది కాలనీవాసులకు అందజేస్తామని చెప్పారు. ఇటీవలే కార్పొరేషన్ ఇన్‌చార్జ్ కమిషనర్ చల్లా ఓబులేష్ కూడా పార్కును పరిశీలించారని తెలిపారు. కార్పొరేషన్‌లో అభివృద్ధి పనులకు సంబంధించి రూ.30కోట్ల వరకు నిధులు ఉన్నాయని వాటితో ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపడుతున్నామని వివరించారు. కాలనీలో అభివృద్ధి పనులకు రూ.30 నుంచి 50 లక్షలు అందిస్తానని హామీనిచ్చారు. 2001లోనే విశాఖ బి కాలనీలో నేషనల్ హైవే కాంట్రాక్టు పనులకు సంబంధించి కార్యాలయం ప్రారంభించానని విశాఖ ఎ, బి కాలనీలతో తనకు ఎంతో అనుబంధం ఉందని చెప్పారు. అనంతరం కాలనీ అసోసియేషన్ ప్రతినిధుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి దుశ్శాలువతో ఎమ్మెల్యే గొండు శంకర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, మహిళలు పాల్గొన్నారు.

## ఆమదాలవలస పీఎస్.. ఎస్పీ ఆకస్మిక తనిఖీ





**ఆమదాలవలస, ఆగస్టు 3 (వార్త):** ఆమదాలవలస పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్‌రెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసుస్టేషన్‌లోని రిసెప్షన్ కేంద్రంతోపాటు పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. డ్యూటి రిజిస్టర్, రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. సిబ్బందికి కేటాయించిన విధులు, వారి పనితీరును పై ఆరా తీశారు. రాత్రి వేళలో ముమ్మురంగా పెట్రోలింగ్ చేయడంతో పాటు గస్తీ విధులు పటిష్టంగా నిర్వర్తించి నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం విజిబుల్ పోలీసింగ్ నిర్వహించి అక్రమ రవాణా అరికట్టాలని, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ సిబ్బందితో మాట్లాడుతూ వారి సమస్యలను తెలుసుకుని ప్రతి ఒక్కరు క్రమ శిక్షణతో విధులు నిర్వర్తించాలని ఎస్పీ సూచించారు.

### కేంద్ర మంత్రిని కలిసిన ఎస్పీ

**శ్రీకాకుళం క్రైం:** కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి శనివారం ఉదయం మర్యాద పూర్వకంగా కలిశారు. కేంద్ర మంత్రి కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో మహిళా సంరక్షణ, లాఅండ్‌ఆర్డర్ పరిరక్షణపై చర్చించారు. వీరి వెంట శ్రీకాకుళం నియోజకవర్గ ఎమ్మెల్యే గొండు శంకర్ కూడా ఉన్నారు.

## కులాల మధ్య బీజేపీ చిచ్చు

### మహానాడు ఐక్యవేదిక అధ్యక్షుడు కంట కృష్ణారావు

**బూర్జ, ఆగస్టు3 (వార్త):** ఎస్సీ వర్గీకరణపై ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలకు అధికారం ఉందని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై మాల మహానాడు ఐక్యవేదిక బూర్జ మండలం అధ్యక్షుడు కంట కృష్ణారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గీకరణ బిల్లు రాజ్యాంగ వ్యతిరేకమని బీజేపీ ప్రభుత్వం కేవలం రాజకీయం కొరకే కుట్రపూరితమైనటువంటి అంశానికి తెరలేపారని ఆరోపించారు. ఈ తీర్పు రాజ్యాంగానికి వ్యతిరేకమని ఇది కేవలం కులాల మధ్య చిచ్చు పెట్టడానికి మాత్రమే బిజెపి ఉపయోగించిన ఒక అస్త్రం అని అన్నారు. దీన్ని అడ్డుపెట్టుకొని బిజెపి రాజ్యాంగాన్ని మార్చే దిశగా అడుగులు వేస్తోందని, మనుధర్మ శాస్త్రాన్ని మళ్లీ భారతదేశంలో అమలు చేయాలని చూస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమాలు ఉధృతం చేస్తామని మాల మహానాడు ఐక్యవేదిక బూర్జ మండలం అధ్యక్షుడు కంట కృష్ణారావు కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వర్గీకరణ బిల్లును నిరసిస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నక్క త్రినాధరావు, కంట శ్రీనివాసరావు, కంట అనిల్ కుమార్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలు కళాశాలల్లోనే నాణ్యమైన విద్య

**రణస్థలం, ఆగస్టు 3 (వార్త):** ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోనే నాణ్యమైన విలువలతో కూడిన విద్యను అందించడం జరుగుతుందని, ఉచితంగా పాఠ్య పుస్తకాలు యూనిఫామ్స్ పంపిణీ చేస్తున్నామని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు శనివారం లావేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలను ఎమ్మెల్యే ఎన్ఈఆర్‌తో కలిసి ఎంపీ పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎంపీ మాట్లాడుతూ జీవితంలో ఇంటర్మీడియట్ దశ కీలకమైనదన్నారు. తల్లిదండ్రులు కష్టపడి చదివిస్తున్నారనే విషయాన్ని గ్రహించి క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని తెలిపారు. ఎమ్మెల్యే ఎన్ఈఆర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యమిస్తుందన్నారు. కళాశాలకు కంప్యూటర్లు ఫర్నిచర్ అందజేస్తామని, కళాశాలకు సిమెంట్ రహదారిని తక్షణమే మంజూరు చేస్తున్నామన్నారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వర్ణలత, టీడీపీ మండల అధ్యక్షుడు ముప్పుడి సురేష్, ఎచ్చెర్ల ఏఎంసి మాజీ చైర్మన్ ఇనపకుర్తి తోటయ్యదొర, తహశీల్దార్ జోగారావు, పి.మధుబాబు, ఏపీవో సత్యవతి, ఎంఈఓలు ఈశ్వరరావు, మురళీకృష్ణ, ముప్పుడి మురళీ, కూర్మారావు, ఇనపకుర్తి భాస్కరరావు, ఎల్.జగన్నదొర, ఎల్.శ్రీను, లుకలాపు అప్పలనాయుడు, పలువురు సర్పంచ్లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.



Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413